క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

అనంతగిరి: రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి మహేందర్ రెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 309 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో వికారాబాద్, తాండూరులో సబ్ డివిజన్ కార్యాలయాలను మంత్రి ప్రారంభించనున్నారని, అందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

బస్సుకోసం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తాండూరు రూరల్: ఆర్టీసీ బస్సు నడపాలని శుక్రవారం విద్యార్థులు ఆందోళన చేపట్టగా.. వారికి వారి తల్లిదండ్రులు, కుల సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. మండల పరిధి చెంగోల్ ఉన్నత పాఠశాలకు పర్వతాపూర్, చింతమణిపట్నంతో పాటు గౌతపూర్ నుంచి విద్యార్థులు వెళ్తుంటారని, వారికి బస్ పాసులు ఉన్నా.. ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సకాలంలో బస్సులు నడిపి, విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు.

బీజేపీ నుంచి జయశ్రీ దరఖాస్తు



పటేల్ తరపున దరఖాస్తు సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు శాసనసభ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జయశ్రీ పటేల్ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. ఆమె అందుబాటులో లేని కారణంగా ఆ పార్టీ నాయకులు అర్జీని అందజేశారు. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన రవిశంకర్ సతీమణి.. ఈసారి బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇప్పటికే తాండూరు నుంచి బీజేపీ అభ్యర్థులుగా పటేల్ రవిశంకర్, లక్ష్మారెడ్డి, రమేష్‌కుమార్‌లు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. కాగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్ నేడు అర్జీ చేసుకోనున్నారు. కార్యక్రమంలో మురళీకృష్ణ గౌడ్, హన్మంతు, రమ్యానాయక్, శ్రీకాంత్ రెడ్డి, మధు తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కల చుట్టూ గుంతలు తీయిస్తున్న జీపీ కార్యదర్శి

కుల్కచర్ల: మొక్కల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మొక్కల చుట్టూ నీరు నిల్వ ఉండేందుకు గుంతలను తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కల పెరుగుదల తోటే జీవకోటి మనుగడ ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నేతల సన్మానం



నర్సిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ యువ నాయకులు

యాలాల: కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సంగెంకుర్దు గ్రామానికి చెందిన నర్సిరెడ్డిని ఆ పార్టీ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన నర్సిరెడ్డిని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యువ నాయకులు సత్యనారాయణరెడ్డి, అనంతయ్య తదితరులు శాలువాలు కప్పి సన్మానించారు.

రుచి మధురం.. ఆరోగ్యం పదిలం

సీతాఫలాల్లో పోషకాలు పుష్కలం
- మార్కెట్లో భలే డిమాండ్

ధారూరు: సీతాఫలం.. పేరు వినగానే ప్రతిఒక్కరికీ నోరూరుతుంది. సహజ సిద్ధంగా లభించే ఈ తియ్యని ఫలాల్లో ఎన్నో పోషక విలువలు కలిగి ఉన్నాయి. చలికాలం ప్రారంభం కాగానే విరివిగా లభించే మధురమైన సీతాఫలం.. అమృత ఫలాన్ని తలపించే వీటిని కస్టర్డ్ యాపిల్, షుగర్ యాపిల్ అనే తదితర పేర్లతో పిలుస్తారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభమైంది. చూడటానికి అందంగా ఉండి నోరూరించే ఈ ఫలాలు.. రుచిలోనే కాదు.. ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. వీటికి మార్కెట్లో డిమాండ్ బాగా ఉంటుంది.

గంపకు రూ.500

తాండూర్–వికారాబాద్ వయా ధారూరు, ధారూరు–నాగసమందర్ వయా రుద్రారం మీదుగా పయనించే వాహనదారులకు రోడ్ల పక్కన విక్రయించే సీతాఫలాలు ఊరిస్తున్నాయి. ధారూరు మండలం రాంపూర్‌తండా, గట్టెపల్లితండా, లక్ష్మీనగర్ తండా, దోర్నాల్‌తండా, రుద్రారం, గడ్డమీది గంగారం, స్టేషన్‌ధారూరు, మన్‌సాన్‌పల్లి గ్రామాలకు చెందిన వారు వీటిని సమీప అడవుల్లో సేకరించి ధారూరు నుంచి తాండూర్ వెళ్లే మార్గంలో రహదారి పక్కనే గంపల్లో పెట్టి విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఒక్కో గంప ఫలాలకు రూ.400ల నుంచి రూ.500ల వరకు విక్రాయిస్తూ ఉపాధి పొందుతున్నారు.



సీతాఫలాలు విక్రయిస్తున్న మహిళలు (ఫైల్)

పోషకాలు అనేకం

సితాఫలం ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు చెప్తున్నారు. దీనిలో పోషక విలువలు చాలా ఉన్నాయని, 100 గ్రాముల గుజ్జు నుంచి 84 క్యాలరీల శక్తి, 20 నుంచి 25 గ్రాముల పిండి పదార్థాలు, 2.5 గ్రాముల ప్రొటీన్లు, 4.4 గ్రాములు పీచు లభ్యమవుతాయన్నారు. మాంసకృతులు 0.8 నుంచి 1.5 గ్రాముల చక్కెర గ్లూకోజ్ రూపంలో 20 నుంచి 22 కొవ్వు పదార్థాలు 0.30 కాల్షియం, 0.02 ఐరన్, పోషక విలువలు ఉండటంతో ఆరోగ్యానికి చాలా మంచిదని, ఇంకా కెరోటిన్ డైమిన్ లాంటివి సమృద్ధిగా లభిస్తాయని పేర్కొన్నారు.

మహిళలకు ఉపాధి

సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబర్ మూడు నెలల పాటు లభించే సీతాఫలాలను దినచర్యగా ఉదయాన్నే సకుటుంబ సమేతంగా మహిళలు అడువుల్లోకి వెళ్లి సేకరిస్తారు. ఇలా రోడ్డు పక్కనే పెట్టుకొని విక్రయిస్తుంటారు. ఈ సీజన్‌లో వారికి సీతాఫలాలతో ఉపాధి లభిస్తుందని, రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు లాభం వస్తుందని పలువురు చెప్పారు. కాయలతో పాటు పండ్లను అమ్ముతుంటామని వెల్లడించారు.



జాబితా తయారీలో నిర్లక్ష్యం తగదు



చెంచుకాలనీలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ పురుషోత్తం

- ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి
- అర్హులను గుర్తించి, పేర్లు నమోదుచేయించాలి
- బీఎల్‌ఓలను ఆదేశించిన తహసీల్దార్ పురుషోత్తం

దోమ: బీఎల్‌ఓలు ఓటరు జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన సమీక్షలో ఏపీఎం సురేశ్, ఏపీఓ దస్తయ్యతో కలిసి బీఎల్‌ఓలతో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు తమ పరిధిలో ఓటరు జాబితా రూప కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి, తప్పులు లేకుండా రూపొందిచాలని సూచించారు. ప్రస్తుతం తయారు చేసే జాబితా రాబోయే ఎన్నికలకు ఉపయోగపడుతుందని, నిర్లక్ష్యం వహించకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఓటరుగా నమోదు కానీ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను గుర్తించి నూతన ఓటరుగా నమోదు చేయించాలని చెప్పారు. మృతి చెందిన వారి పేర్లు, డూప్లికేట్, డబుల్ ఓటర్లను గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. ఇంటింటికీ సభ్యుల వివరాలను, ఓటరుగా ఉన్నారా? లేరా? అని పరిశీలించాలన్నారు.

ఎంతో విలువైనది

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ మంజులతో కలిసి ఓటరు నమోదుపై తహసీల్దార్ అవగాహన కల్పించారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది ఎంతో విలువైనదని, అర్హులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మోత్కుర్ గ్రామ పరిధిలోని చెంచుకాలనీలో గ్రామస్తులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఓటు ఉన్నవారు హక్కును వినియోగించుకోవాలని, అర్హుల ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ లింగం, ఏంపీఓ సోమలింగం, ఆయా గ్రామాల బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

కుల్కచర్ల: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొత్కూరు వెంకటేశ్, మండల అధ్యక్షుడు రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఐలమ్మ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ.. అలా చేయక పోవడం బాధాకరమన్నారు. ఈ నెల 10న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వర్ధంతిని జరిపేందుకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు బాల్‌రాజ్, లక్ష్మయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, హన్మంతు, అనంతయ్య, భీమయ్య, శ్రీనివాస్, గోపాల్, టి.గోపాల్, బాలరాజు, ఆంజనేయులు, బాలు, గోపాల్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో సంతోషిమాత ఆలయాన్ని పునఃనిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రాంగణంలో హోమం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి విగ్రహానికి ధాన్య, జలావాసాలు నిర్వహిస్తూ పూజలు చేయగా.. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గుడి పునఃనిర్మాణంలో కీలక పాత్ర పోషించిన దాతలను నిర్వాహకులు సన్మానించారు. భక్తులకు ఆలయ తీర్థప్రసాదాలు అందజేశారు.



దాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్యే పరామర్శ



అన్వర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: అనారోగ్యానికి గురై కోలుకుంటున్న జామా మసీద్ అధ్యక్షుడు అన్వర్‌బాయ్‌ను శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరామర్శించారు. వారం రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి వచ్చిన అన్వర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఇందులో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్, నాయకులు రమేష్‌బాబు, అరుణ్, ఎస్ఎం.గౌసన్, బాబ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అమరులకు గుర్తుగా 'అమృత్‌వాటిక'



పరిగి: దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని మేరి మిట్టి మేరాదేశ్ కోర్డినేటర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మేరిమిట్టి మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని 4, 13వ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించి మాట్లాడారు. ఢిల్లీలో నిర్మిస్తున్న అమృత్‌వాటిక నిర్మాణానికి సేకరించిన ఈ మట్టిని పంపిస్తామని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వారికి గుర్తుగా అమృత్‌వాటిక నిర్మిస్తున్నారని తెలిపారు. ఇందులో పార్టీ నాయకులు నర్సింహులు, శ్రీనివాస్, సంజీవ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పౌష్టికాహారం తీసుకోవాలి

అనంతగిరి: గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల సూచించారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్పలో పోషన్ మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు.

◆ విద్యాశాఖలో విలీనం చేయాలి

అనంతగిరి: సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించి, విద్యాశాఖలో విలీనం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. సర్వశిక్ష ఉద్యోగ జిల్లా నాయకులు గంగ్యానాయక్, స్వప్నరెడ్డి పాల్గొన్నారు.

◆ మహిళల రక్షణ కోసమే షీటీం

పరిగి: మహిళల రక్షణ కోసమే షీటీం పనిచేస్తుందని షీటీం ఇన్‌చార్జి నర్సింహులు తెలిపారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పలు పాఠశాలల్లో షీటీంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా సమాచారం ఇవ్వాలని సూచించారు. షీటీం రక్షణ కోసం 181కు కాల్ చేసి, సమాచారం ఇస్తే చాలు పోలీసులు అక్కడికి వచ్చి రక్షిస్తారని చెప్పారు. ఇందులో షీటీం సభ్యులు మనీష, శోభారాణి ఉన్నారు.

◆ పర్యావరణాన్ని కాపాడాలి



అనంతగిరి: ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి, పర్యావరణాన్ని కాపాడాలని డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి బాలికల గురుకుల పాఠశాలలో శ్రీ రామకృష్ణ సేవా సమితి, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాని సూచించారు. సమితి ఆధ్వర్యంలో వెయ్యి సీడ్ బాల్స్‌ను అనంతగిరి అడవిలో విసిరారు. ఇందులో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అరుణ, సమితి అధ్యక్షుడు బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు బస్వరాజు, ప్రిన్సిపాల్ రమణమ్మ, ప్రోగ్రాం కన్వీనర్ వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం కృష్ణాష్టమిని పురస్కరించుకొని వైభవంగా ఉట్ల ఉత్సవం జరిపారు. ఆలయంలో సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారు మాఢ వీధుల్లో తిరుచ్చి ఉత్సవంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



మోమిన్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

- పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి
- ఎంపీడీఓలు శైలజారెడ్డి, సుదర్శన్‌రెడ్డి



తాండూరు రూరల్: సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

మోమిన్‌పేట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శైలజారెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె మాట్లాడారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదని, వెంటవెంటనే చెత్తాచెదారం, మురుగు కాల్వలను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నెలలో రెండు సార్లు ఓవర్ హెడ్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించాలన్నారు. విద్యుత్ సమస్యలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని, సంబంధిత అధికారులు స్పందించాలని ఆమె సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చరితరెడ్డి, ఎంపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

తాండూరు రూరల్: వర్షా కాలంలో అన్ని శాఖల అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తాండూరు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో అన్ని శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. పల్లెల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. అదే విధంగా వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తు అవగాహన చర్యలు చేపట్టాలన్నారు. పైప్‌లైన్ లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ రతన్‌సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

నవాబుపేట: బీఆర్ఎస్ నాయకుల అవినీతిని ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ కేసులు పెట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం ఎల్లకొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లకొండలో జరిగిన అవినీతిని ఎత్తి చూపినందుకు సర్పంచ్, స్థానిక ఎమ్మెల్యే కలిసి అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే తాము చేసిన విమర్శలు అబద్ధం అని ప్రజల్లో నిరూపించుకోవాలని సవాల్ చేశారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు బీఆర్ఎస్ నాయకుల అక్రమార్జన మొత్తాన్ని కక్కిస్తామన్నారు. ఇందులో నాయకులు నర్సింహులు, శివకుమార్, ఆనందం, యాదగిరి, పరమేష్, శివ, వార్డు సభ్యులు పరమేష్, అజుముద్దీన్ ఉన్నారు.

బీసీలను మోసం చేసిన బీఆర్ఎస్

మోమిన్‌పేట: బీసీ కులాలకు రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శుభాష్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర జనాభాలో 50శాతం పైగా ఉన్న బీసీలకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అయినా తగిన న్యాయం చేయాలని కోరారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని మూడు స్థానాల్లో రెడ్డిలే ప్రాతినిధ్యం వహిస్తున్నారని, తాండూరు టికెట్‌ను బీసీలకు ఇవ్వాలన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: చౌడాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బ్యాగరి జంగమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి స్థానిక నేతలతో బాధిత కుటుంబానికి శుక్రవారం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు రాము, నాయకులు యాదయ్య, నరేష్, బాలయ్య, చిన్నయ్య, నర్సింహులు, యాదయ్య, జంగయ్య, భాస్కర్ ఉన్నారు.

12రోజులు ప్రత్యేక ప్రార్థనలు

కొడంగల్ రూరల్: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని 12 రోజుల పాటు మసీద్‌లు, ఇళ్లల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం. గౌసన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జామా మసీద్‌లో ఎంఏ.అబ్దుల్ రశీద్, సయ్యద్ అన్వర్‌లు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ప్రత్యేక ప్రార్థనలకు ముస్లింలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సయ్యద్ బాబ, సయ్యద్ అప్సర్, ఎండీ.యూసుఫ్, అబ్దుల్ ఖాదర్, మక్సూద్ బిన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పచ్చదనం ఉట్టిపడాలి

- పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి
- ఎంపీడీఓ పాండు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పాండు

కొడంగల్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను శాఖల వారీగా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ పాండు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటి పచ్చదనం ఉట్టిపడేలా పల్లెలను తీర్చిదిద్దాలని చెప్పారు. వర్షా కాలంలో మురుగు నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపడుతూ.. పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత చూపాలని ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా మిలాథిన్ పౌడర్, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి

గ్రామాల్లోని నర్సరీల మొక్కలను ఖాళీ ప్రదేశాల్లో నాటించాలని, క్రిమిటోరియం, క్రీడా ప్రాంగణాలు తదితర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ రాములు, ఏపీఎం వెంకన్న, మెడికల్ ఆఫీసర్లు, మిషన్ భగీరథ, విద్యుత్, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రికి నేతల నివాళి



మాణిక్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రమేష్ మహరాజ్ తదితరులు

తాండూరు: తాండూరు ప్రాంత కీర్తి ప్రతిష్టలను దేశవిదేశాలకు తీసుకెళ్లిన ఘనత మాజీ మంత్రి మాణిక్‌రావుకే దక్కుతుందని ఏఐసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మాణిక్‌రావు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మల్లప్ప మడిగే ప్రాంతంలోని మాణిక్‌రావు విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మహరాజ్, మాణిక్‌రావు సతీమణి శశిప్రభ, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, బీఆర్ఎస్ నాయకులు సంపత్‌కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు కోర్వార్ నగేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాణిక్‌రావు సేవలను కొనియాడారు. బీసీ సంక్షేమ సంఘం తాండూరు నియోజకవర్గ కన్వీనర్ రాజ్‌కుమార్, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తంచంద్‌లతో పాటు పలువురు నాయకులు మాణిక్‌రావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా మాణిక్‌రావు అభిమానులు, నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలు సీతారంజిత్ రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో వికారాబాద్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు గోపాల్, అనంతరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు వెంకట్, అనంతరెడ్డి ఉన్నారు.
– అనంతగిరి